విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 9, సెప్టెంబరు 2024

నేడు పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

- కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర-నంద్యాల : ఈ నెల 09వ తేదీ సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్)" ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం" కార్యక్రమానికి ఈనెల 09వ తేదీ ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని, అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజక వర్గ, డివిజన్ స్థాయిలో కూడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మల్లారెడ్డి కుంటకు గండి...

- 200 ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు

- 2020లో గండిపడితే తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టిన అప్పటి ప్రభుత్వం

విశాలాంధ్ర-చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలోని మల్లారెడ్డి కుంటకు ఆదివారం గండి పడింది. మండలం గుండా. సాగే తెలుగు గంగ ప్రధాన కాలువ నుంచి వచ్చే నీటితో ఏటా మల్లారెడ్డి కుంట నిండుతుంది. కుంట నీటితో చిన్న వంగలి పరిసరాల్లో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా సాగు నీటికి, పశువులు తాగేందుకు నీటిని వాడేవారు. కుంట పూర్తిగా నిండడంతో ఆదివారం మధ్యాహ్నాల ఒక్కసారిగా గండి పడి నీరంతా వృధాగా వెలుతుంది. ఫలితంగా గ్రామంలోని దాదాపు 200ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కడప జిల్లా దువ్వూరు మండలం పరిధి లోని మరో 100 ఎకరాలు నీట మునిగాయి. అధికారులు స్పందించి సకాలంలో గండిని పూడ్చకపోతే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంది.

గతంలో గండిపడ్డా పట్టించుకోని గత ప్రభుత్వం... 2020వ సంవత్సరంలో మల్లారెడ్డి కుంటకు గండిపడింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేవలం రూ.4లక్షలతో తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. ఫలితంగా నేడు మళ్లీ గండిపడింది. గత ప్రభుత్వం మల్లారెడ్డి కుంటకు శాశ్వత పరిష్కారం చేసి ఉన్న అయితే నేడు ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదని రైతులు అంటున్నారు.

గండి పడిన ప్రదేశం నుంచి వెళ్తున్న నీరు

నీట మునిగిన పంట పొలాలు

సలీంనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

సీపీఐ నాయకులు

విశాలాంధ్ర, నంద్యాల అర్బన్: సలీంనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ శాఖ సమావేశంలో భాగంగా ఆదివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శి భూమాని శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ బాబా ఫక్రుద్దీన్, సీపీఐ పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సలీంనగర్‌లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారు. వారికి ఇళ్ల పట్టాలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కొన్ని వీధులలో వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదన్నారు. అలాగే చిన్నపాటి వర్షానికే రహదారులపై వర్షపు నీరు నిలువ ఉండి దోమలు వృద్ధి చెంది విషపురుగులతో ప్రజలు బిక్కు బిక్కుమంటూ జీవనం చేస్తూ ఉంటే ఏమాత్రం ఈ ప్రాంతం పైన అధికారులు దృష్టి పెట్టకపోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా రహదారుల్లో, ఖాళీ స్థలాలలో నిలిచిన వర్షపు నీటిని తొలగించి దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేసి పరిశుభ్రంగా ఉంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐగా కోరుతున్నామని లేనియెడల పట్టణ వాసులను కలుపుకొని మున్సిపల్ కార్యాలయం దగ్గర పెద్దఎత్తున ఆందోళనకు పిలుపు నిచ్చామన్నారు. సమావేశంలో పార్టీ సభ్యులు కలాం, అబ్దుల్ సలాం, జమాల్, రాజు, అల్తాఫ్, అబ్దుల్ వహీద్, సుబ్బరాయుడు, వంశీ, రవి, ఫకీర్ బాష, సిమ్లా, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహృదయంతో సహాయం చేయండి

- శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర ఆత్మకూరు టౌన్ : ఆత్మకూరు పట్టణంలోని కొండ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీశైలం నియోజకవర్గం ఎన్డీఏ కూటమి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ కూడా నాయకులు ప్రజలు కల్మషం లేని మనుషుతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వరద బీభత్సానికి ఇబ్బందులకు గురవుతున్న బాధితు లను ఆదుకోవాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రి, పగలనక ప్రజల బాగోగులను చూసేందుకు ఎంతగానో శ్రమిస్తున్నాడన్నారు. మన నియోజకవర్గ నుండి ఎంతోకొంత డబ్బులను సేకరించి వరద ముంపుతో ఇబ్బంది పడుతున్న వారికి సహాయం చేస్తే బాగుంటుందన్నారు. ఈ సహాయార్థ సేవలో ఎస్ ఎన్ తాండాకు చెందిన ఓ ఏడు సంవత్సరాలు కలిగిన చిన్నారి రోజు తను వేసుకునే హుండీని తీసుకొచ్చి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి వరద బాధితులకు సహాయార్థం తన వంతు సహాయం అందించింది. శ్రీశైలం నియోజకవర్గంలోని ఏ కోడూరు, సంతజూటూరు గ్రామాల టీడీపీ నాయకులు తమ వంతు సహాయంగా చెరో లక్ష రూపాయలు నగదును ఎమ్మెల్యేకు అందజేశారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన మంత్రి బీసీ

విశాలాంధ్ర బనగానపల్లె: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నంద్యాల జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వివిధ వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తల సమస్యలపై ఆర్అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వినతిపత్రాలు స్వీకరించి, అక్కడిక్కడే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు .

శాలుబి హత్య కేసులో నిందితుల అరెస్ట్.. రిమాండ్ : డీఎస్పీ

విశాలాంధ్ర, నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని మారుతినగర్‌లో శాలుబి (45) అనే మహిళను గత గురువారం రాత్రి హత్య చేసిన విషయం తెలిసిందే, అయితే ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఆత్మకూరు డిఎస్పీ రామాంజీ నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో కేసు వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన శాలుబి గతంలో 2015లో శాలుబి, ఆమె స్నేహితురాలు రేష్మ కలిసి వడ్డే లక్ష్మీనరసింహను హత్య చేశారు. నేడు లక్ష్మినరసింహా కుమారుడు తన తండ్రిని హత్య చేసిన శాలుబీని ఎలాగైనా హతమరచాలని అందుకు ప్రతీకారంగా వడ్డే చందు అతని మిత్రులు ఎస్.వెంకటరమణ, మనోజ్‌కుమార్, పి.స్వాములు ఏ.వెంకటేశ్వర్లు, సీసీఎల్ బాల నేరస్తుడు శాలిబిని చంపాలని నిర్ణయించాడు. గురువారం అర్ధరాత్రి వేళ శాలుబి ఇంటికి వెళ్లిన నిందితులు గొడ్డలితో గేటును చెక్క తలుపులను పగలగొట్టి ఇంట్లోకి మారునాయుధాలతో వెళ్ళి శాలుబి కొడుకుని మొలాలిని భయపెట్టి హతురాలు పింజరు శాలబీని అతి కిరాతకంగా గొడ్డలి నాటు తుపాకులతో దాడి చేసి హత్య చేశారని తెలిపారు. ఈ హత్యలో బీహార్‌కు చెందిన మనోజ్‌కుమార్, మరొక బాల నేరస్తుడు తప్పించుకోవడంతో అతని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. నిందితులను ఆదివారం పట్టణ శివార్లలో ఉన్నారని తెలుసుకొని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద ఉన్న రెండు నాటు తుపాకులు గొడ్డలిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. కేసును చేదించిన సీఐ సుబ్రహ్మణ్యంను, ఎస్ ఐ లు లక్ష్మినారాయణ, తిరుపాలు, ఓబులేష్, శరత్ కుమార్ రెడ్డి లను ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా అభినందించారని తెలిపారు. కానిస్టేబుల్ చెన్నయ్య, హెూంగార్డు గోపాల్, లను డిఎస్పీ రివార్డు అందించారు.

మిత్రురాలికి రూ.30 వేల సాయం

విశాలాంధ్ర, రుద్రవరం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007 10వ తరగతి పూర్వ విద్యార్థులు తమతో చదివిన విద్యార్థినికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు. పెద్దకంబలూరు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మీ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. చికిత్స నిమిత్తం సుమారు రూ.60 వేలు అవసరం అయ్యాయి. మిత్రులు ఆమె ఆర్థిక పరిస్థితులు తెలుసుకుని తమ వంతుగా రూ.30 వేల నగదు అందజేశారు. గతంలో కూడా తమ తోటి విద్యార్థులను ఆపద సమయంలో అండగా ఉన్నామని, భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కాశీం, సురేంద్ర, గురుప్రసాద్, శేషు, పుల్లయ్య, హుసేని, అనీల్, ఉసేని, బాల వెంకటయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

అహోబిలంలో వైభవంగా స్వాతి వేడుకలు..

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : లక్ష్మీ నరసింహ స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఎగువ, దిగువ అహెూబిలం క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వాతి సందర్భంగా నవ నరసింహ క్షేత్రాలలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ అహెూబిలంలోని లక్ష్మీ నరసింహ స్వామి వారికి చెంచులక్ష్మి అమ్మవారికి, దిగువ అహెూబిలంలోని ప్రహ్లాద వరదస్వామి, అమృత వల్లి అమ్మవార్లకు అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ అహెూబిలం క్షేత్రంలోని అద్దాలమండపంలో ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో సుదర్శన హెూమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

అహెూబిలంలో ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : దిగువ అహెూబిలంలో అహెూబిల మఠం పీఠాధిపతి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డకు చెందిన డాక్టర్ వెంకట సుబ్బారెడ్డి హాస్పిటల్ వారి సౌజన్యంతో స్వాతి హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్వాతి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారెడ్డి, స్పెషలిస్ట్ డాక్టర్ల బృందం రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. హాస్పిటల్ ఎం.డి డాక్టర్ నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇకపై ప్రతినెల దాతల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వ హిస్తామన్నారు. వైద్య శిబిరాన్ని దేవస్థానం ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ లక్ష్మిరెడ్డి, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక, డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి, స్వాతి హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభిలాష్, జూనియర్ డాక్టర్లు సాయి తేజస్విని, లాస్య, సుష్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ పూట విషాదం

బావిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృత్యువాత..

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ : వినాయక చవితి పండుగ రోజున మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన లింగం చిన్నకర్రెన్న, లక్ష్మిదేవి దంపతుల కుమారుడు కళ్యాణ్(12) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. శనివారం గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి బావిలో ఈతకు వెళ్ళాడు. ఈత చివరలో మూడు మునకలు వేసే సమయంలో మూడవ మునక మునగడంలో అలాగే నీటి అడుగు భాగానికి చేరుకున్నాడు. కళ్యాణ్ ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో స్నేహితులు బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు అక్కడికి వెళ్లి బావిలోకి దిగి విద్యార్థిని బయటకు తీశారు. విద్యార్థి అప్పటికే మృతి చెందాడు. ఈ కళ్యాణ్ ఉయ్యాలవాడ మోడల్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్నాడు. వినాయక చవితి పండుగ కావడంతో పాఠశాలకు సెలవు రావడంతో ఇంటి వద్దనే ఉన్నాడు. పై దంపతులకు కళ్యాణ్ తో పాటు కుమార్తె అక్షయ 8వ తరగతి, తమ్ముడు పవన్ 3వ తరగతి చదువుతున్నాడు. పండుగ రోజున గ్రామంలో విషాదం చోటు చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి డీఈవో సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. డీఈవో ఆదేశాల మేరకు ఆదివారం విద్యార్థి కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేసి విద్యార్థి మృతి పట్ల ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపల్, అధ్యాపకులు వెంకటచంద్ర, మురళీకృష్ణలు తల్లిదండ్రులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు.

విద్యార్థి తండ్రికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంఈఓ

చికిత్సలు అందించడంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ వి.ఎస్. ప్రసాద్

విశాలాంధ్ర-నంద్యాల : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ అనుబంధ విభాగం ఆధ్వర్యంలో నంద్యాల ఐఎంఏ నిర్వహణలో ఆదివారం స్థానిక సూరజ్ గ్రాండ్ హెూటల్‌లో రాయలసీమ ప్రాంత వైద్యులకు వైద్య వృత్తి సంబంధిత చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఐఎంఏ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ అనుబంధ విభాగం చైర్మన్ డాక్టర్ వివిఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సు ప్రారంభోత్సవంలో అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ సమన్వయకర్తగా, డాక్టర్ అనిల్‌కుమార్ నిర్వహణలో జరిగిన సదస్సులో భారతీయ శిక్షా స్మృతిలో వైద్య నిర్లక్ష్యానికి సంబంధించిన చట్టాలు, వీటికి సంబంధించి వచ్చిన సుప్రీంకోర్టు తీర్పుల గురించి ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్ర రావు, వైద్యులపై నిర్లక్ష్యం ఆరోపణలు రాకుండా తీసుకోవాల్సిన వైద్యపరమైన జాగ్రత్తలపై ఐఎంఏ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ విభాగం చైర్మన్ డాక్టర్ వి.ఎస్, ప్రసాద్, ఐఎంఏ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ భీమా విభాగం సభ్యులకు అందించే సేవల గురించి కార్యదర్శి డాక్టర్ జిఎస్. మూర్తి, ఆసుపత్రులలో చికిత్స చేస్తున్న సమయంలో అనుకోకుండా విపత్తులు వచ్చినప్పుడు వైద్యులు వ్యవహరించాల్సిన తీరు గురించి డాక్టర్ మధుసూదన రావ్, ఐఎంఏ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ బీమా గురించిన వివరాలు ఆ విభాగం వైస్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, వైద్య వృత్తిపరమైన న్యాయ సమస్యలు ఎదుర్కోవడానికి వృత్తి భీమా పాలసీ అవసర గురించి ఐఎంఏ నంద్యాల అధ్యక్షురాలు డాక్టర్ వసుధ ప్రసంగిం చారు. ఈ సదస్సులో రాయలసీమ ప్రాంతానికి చెందిన ఐఎంఏ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీహరి రావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ త్యాగరాజ రెడ్డి, డాక్టర్ హరికుమార్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ పనిల్ కుమార్, అధిక సంఖ్యలో నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.



నంద్యాల కాంగ్రెస్ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మి నరసింహ యాదవ్

- ముచ్చటగా మూడోసారి వరించిన పదవి

విశాలాంధ్ర-నంద్యాల ..నంద్యాల కాంగ్రెస్ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మి నరసింహ యాదవ్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసినందుకు అయన సేవలను గుర్తించి ఏఐసీసీ, పీసీసీ మూడవసారి నంద్యాలపార్లమెంట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వ్యవస్థాపక అధ్యక్షుడు కేసి వేణుగోపాల్, సిడబ్లుసి మెంబర్ రఘువీరారెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డిలకు జెంగిటి లక్ష్మిలకు నరసింహ యాదవ్ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసింహయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి మొదలుకొని రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.

కొత్తూరు సుబ్బరాయుడి సన్నిధిలో కర్నూలు జిల్లా జడ్జి

విశాలాంధ్ర-పాణ్యం : ఎస్.కొత్తూరులో వెలిసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కర్నూలు జిల్లా జడ్జి ప్రతిభా దేవి కుటుంబ సమేతంగా ఆదివారం స్వామివారిని సం దర్శించుకున్నారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆలయ అర్చకులు సురేష్ స్వామి, కిట్టయ్యస్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి అభిషే కాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాలతో సత్కరించారు.

గురు రాజా విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ



విశాలాంధ్ర-నంద్యాల : ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆర్ట్స్ అండ్ కల్చర్ హెరిటేజ్ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలో గల శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యా ర్థులు ప్రథమ స్థానం సాధించినట్లుగా నంద్యాల జిల్లా ఇంటాచ్ ఆర్గనైజే షన్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. విజేతలకు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాలను అందజేసి విద్యార్థుల విజయాలను ప్రశంసిం చారు. విజేతలు రాష్ట్రస్థాయిలో జరిగే క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొంటారని తెలిపారు. క్విజ్ కాంపిటీషన్‌లో విజేతలుగా నిలిచిన సాత్విక, అమూల్య విద్యార్థులను డైరెక్టర్ పి.షేక్షావలిరెడ్డి అభినందించారు.

బొజ్జగణపయ్యకు ఘనంగా చవితి పూజలు

- వినాయకుడి ఆశీర్వాదాలతో జిల్లా అభివృద్ధి పథంలో నడవాలి

- పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు

విశాలాంధ్ర-నంద్యాల : వినాయక చవితి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గణేశ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి గణియా, శ్రీహరి దంపతులు పాల్గొని పరిపాలన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ సర్వ విఘ్నాలను అధిగమించి జయం కలిగించే వినాయకుడి ఆశీర్వాదములతో జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని కోరుకున్నట్లు తెలిపారు. బుద్ధి, సిద్ధినిచ్చి, దుఃఖాన్ని నివారించి, సంతోషాన్ని కలిగించే గణేశుడు జిల్లా ప్రజలకు, వారి కుటుంబ సభ్యులకు విద్యాబుద్ధులు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ, కలెక్టరేట్ ఏఓ రవి,అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడలో..

గణపతి పూజలో పాల్గొన్న ఫయాజ్



విశాలాంధ్ర-నంద్యాల ..నంద్యాల సంజీవనగర్ రామాలయం శ్రీ భగవత్ సేవ సమాజ్ పాలకవర్గం ఆధ్వర్యంలో శ్రీ పంచముఖి బృహచ్ఛద (అక్రూట్) మహా గణపతి విగ్రహం దగ్గర ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మతసామరస్యంతో పండుగ జరుపుకోవాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం ఏదో ఒక కొత్త రూపంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న కమిటీ వారు ఈ సంవత్సరం శ్రీ పంచముఖి బృహచ్ఛద (అక్రూట్) మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయ మని, ప్రతి ఒక్కరు దర్శించుకుని ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో 36 వార్డు ఇంచార్జ్ మారుతి ప్రసాద్, టీడీపీ నాయకులు పవన్ యాదవ్, చంటి, ఉదయ్, నేరెళ్ల అశోక్ కుమార్, శ్రీనివాసులు, పుల్లయ్య, అలీ తదితరులు పాల్గొన్నారు.

డోన్ ఇందిరాగాంధీ నగర్‌లో

ఉయ్యాలవాడలో..

LOST OF PASS PORT

Lost my Original INDIAN PASSPORT NO. W2251361, Date 08-07-2022. Issued at VIJAYAWADA and Expiry Date 07-07-2032. The said lost my Passport while I am going to Shukur HAJ and UMARH travel near Muncipal high school, Nandyal, date 28-07-2024, If any one founded send to Shaik FIRDOSE HAJA, H.No : 10/4, Telugu Peta, NANDYAL CELL NO. 9182351440.

10న పంటల పరిశీలన-ఏపీ రైతు సంఘం

విశాలాంధ్ర-కర్నూలు: ఈ నెల 10న ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో పంటల పరిశీలన చేయనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.కార్యక్రమంలో ఏపీరైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రామచంద్రయ్య రాష్ట్ర రైతుసంఘం కార్యదర్శి కె.జగన్నాథం, ఏపీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.గిడ్డయ్యలు పాల్గొంటారని తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్లో జూన్, జూలైలో కొంతమేరకు చిన్నపాటి వర్షాలకు రైతులు వేసుకున్న పంటలు ఉల్లి,మిరప, ఆముదం, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, కొర్ర,వరి తదితర పంటలు అప్పటిలో కొంతమేరకు బాగానే ఉన్నాయన్నారు.ఆగస్టులో 20 రోజుల నుండి కురిసిన,అధిక వర్షాలతో రైతులు వేసుకున్న పంటలు దెబ్బ తిన్నాయన్నారు. 10న జిల్లా రైతు సంఘం బృందం కర్నూలు నుండి బయలుదేరి కోడుమూరు, గోనేగండ్ల, ఎమ్మిగనూరు, ఆదోని, ఆస్పరి, పత్తికొండ, దేవనకొండ ప్రాంతాల్లో పరిశీలన చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దేవనకొండ మండలంలోనూ...

విశాలాంధ్ర-దేవనకొండ రూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లాలో ఈనెల 10న పంటల పరిశీలన చేయనున్నట్లు రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పంటల పరిశీలన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.రామచంద్రయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి.కే.జగన్నాథం, జిల్లా ఉపాధ్యక్షులు బి.గిడ్డయ్యలిలు పాల్గొంటారని ఆయన వివరించారు. రైతులు బ్యాంకులో తీసు కున్న పంట రుణాలు మాఫీ, రైతులు రబీ సీజన్లో వేసుకునే పంటలకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, ఇవ్వాలని డిమాండ్ చేశారు.పంటల పరిశీలన 10న జిల్లా రైతు సంఘం బృందం కర్నూలు నుండి బయలుదేరి కోడుమూరు, గోనేగండ్ల, ఎమ్మిగనూరు, ఆదోని, ఆస్పరి, పత్తికొండ, దేవనకొండ ప్రాంతాల్లో పరిశీలన చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వరద బాధితుల కోసం సీపీఐ విరాళాల సేకరణ

విశాలాంధ్ర-ఆదోని: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కోసం సీపీఐ రాష్ట్ర పిలుపు మేరకు శనివారం ఆదోని మున్సిపల్ మెయిన్ బజార్, సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి, పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావి రాజు మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదల్లో సర్వస్వం కోల్పోయిన వరద బాధితులను మానవత దృక్పథంతో రాజకీయపార్టీలకు అతీతంగా ఆదుకోవాలని కోరారు. వరదల్లో చిక్కుకొని అనేక ఇబ్బందులు పడుతున్న బాధితుల సహాయార్థం పట్టణంలో సాయం చేసిన వ్యాపారస్తులు, ప్రజలకు సీపీఐ తరపున ఉద్యమ అభివందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కుమారస్వామి, విజయ్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ కుమార్, అంజిత్‌గౌడ్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొత్తూరు గంగన్న, సీపీఐ పట్టణ నాయకులు కొత్తూరు ఈరన్న, పుష్పరాజు, అనుమప్ప, రామన్నగౌడ్ పాల్గొన్నారు.

కోడుమూరు: సీపీఐ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆర్థికసాయం అందించాలని కోరుతూ విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, మండల కార్యదర్శి బి.రాజు,చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.మాధవ స్వామి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మద్దూరు చిన్నరాముడు తదితరులు విరాళాల సేకరణచేపట్టారు.ఆదివారం స్థానిక రోడ్డుపక్కనున్న పండ్ల వ్యాపారులు, ఆటో కార్మికులు, కొండపేట ప్రాంతంలోని చేనేత కాలనీలోకి వెళ్లి వరద బాధితులకు సాయం అందించాలని ప్రచారం చేస్తూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలతో విజయవాడ ప్రాంతంలోని ప్రజానీకం అన్నం,నీళ్లు దొరకక చాలామంది ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదనీటి ప్రభావంతో నిలువనీడ లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలు అందిస్తున్నా,ఇంకా చాలామంది ఇబ్బందులు పడుతున్నారని, వరద బాధితులకు అందరు కూడా సహకారం అందించాలన్నారు.కేంద్ర ప్రభుత్వం వరదల విపత్తును జాతీయ విపత్తుగా గుర్తించి నిధులు కేటాయించి నష్టపోయిన ప్రజానీకానికి ఆర్థిక సహాయం అందించేందుకు నిధులు కేటాయించాలని తెలిపారు.కోడుమూరులో చాలా మంది వరదల్లో నష్టపోయిన వారికి సాయం అందించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. చిన్నారులతో సహా వరద బాధితులకు విరాళాలు ఇస్తున్నారని,వారందరికీ సిపిఐ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు మరమ్మత్తులు చేయించండి-ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-తుగ్గలి: మండల పరిధిలోని రాంపల్లిలో పొలాలకు వెళ్ళేవారికి అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఓను దగ్గర బోరింగు వేయించారు. అయితే ఆరు నెలలుగా మంచినీటి బోరు పనిచేయడం లేదని గ్రామస్తులు మండల ఏ.ఐ.వై.ఎఫ్.అధ్యక్షుడు రాంపల్లి చిరంజీవి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై చిరంజీవి మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి చెడిపోయిన బోరుకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకుడు టైలర్ లాలన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం (నేడు) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్, రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజా సౌకర్యార్థం రోడ్ల మరమ్మత్తు

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుండలో గణేష్‌పండుగ సందర్భంగా సర్పంచు రంగమ్మ గ్రామంలో రోడ్లమరమ్మత్తు చేపట్టారు. గుంతల మయంగా ఉన్న రోడ్లకు గరుసుమట్టిని వేసి జేసీబీ ద్వారా రోడ్డును చదును చేయడంతో ప్రజల రాకపోకలకు ఎంతో అనుకూరమైంది ఈర్ల కట్ట, వీరభద్రేశ్వరస్వామి ఆలయం తదితర కాలనీలో రోడ్డు వర్షానికి బురద మయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నందుకు సర్పంచు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించారు. ట్రాక్టర్ల ద్వారా గరసుమట్టిని తరలించి జేసీబీ సాయంతో రోడ్డు మరమ్మతు చేశారు. వైసీపీ నాయకుడు పంప, గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఘాట్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-కర్నూలు క్రైం: వినాయక నిమజ్జన ఘాట్‌ను ఆదివారం జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పరిశీలించారు.కేసీ కెనాల్, వినాయక్ ఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహాలు బయలు దేరే మొదటి రాంబోట్ల దేవాలయం, బాదంమాస్క్ మీదుగా, కింగ్ మార్కెట్, కొండారెడ్డి బురుజు మీదుగా అంబేద్కర్ సర్కిల్, రాజ్ విహార్ మీదుగా వెళ్లే వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రాంతాలు పరిశీలించారు.అనంతరం వినాయక నిమజ్జనం ఘాట్లోని కేసీ కెనాల్ దగ్గర వినాయక విగ్రహాలు ఎత్తే భారీక్రేన్లకు సంబంధించిన డ్రైవర్లు, గజఈత గాళ్ళను సిద్ధంగా ఉంచు కోవాలన్నారు.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఇతర శాఖలకు అధికారులకు సూచించారు.ఎస్పీ వెంట కర్నూలు డిఎస్పీ జె.బాబుప్రసాద్, సీఐలు ప్రసాద్, రామయ్య నాయుడు, మురళీధర్‌రెడ్డి, కేశవరెడ్డి, నాగరాజరావు, ట్రాఫిక్ సీఐ మనసూరుద్దీన్, గణేష్ ఉత్సవ సమితి కమిటి సభ్యులు, తదితరులున్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా పరిగెల

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు: కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు పరిగెల మురళీకృష్ణ నియమితులయ్యారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మురళీకృష్ణను అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఆదేశాల మేరకు అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీవేణుగోపాల్ నియమించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ తనపై మీద నమ్మకంతో అధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ,యువ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే, ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల, జాతీయ, రాష్ట్ర నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీని నాయకులు కార్యకర్తలను అందర్నీ కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తానని దేశంలో రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యమని తెలిపారు.

వరద బాధితులకు కూరగాయల సేకరణ

విశాలాంధ్ర-కోడుమూరు : విజయవాడ నగరంలో వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం కోడుమూరు తెలుగుదేశం నాయకులు కే.ఈ.మల్లికార్జునగౌడ్ ఆధ్వర్యంలో మూడున్నర టన్నుల వివిధ రకాల కూరగాయలను సేకరించారు. ఆదివారం కోడుమూరు నుంచి ఓ వాహనంలో సేకరించిన కూరగాయలను వరద ప్రభావిత ప్రాంతమైన విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా కే.ఈ.మల్లికార్జునగౌడ్ మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని ముంచెత్తిన వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను అన్నివిధాలా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు మంత్రులు,నాయకులు, కార్యకర్తలందరూ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కోడుమూరు టీడీపీ ఇంచార్జి విష్ణువర్ధన్‌రెడ్డి,ఎమ్మెల్యే దస్తగిరిల ఆదేశాల మేరకు దాతల సహకారంతో కూరగాయలు సేకరించి విజయవాడకు పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లప్పనాయుడు, బడిసాగౌడు, గోపాల్ నాయుడు, బీరువాల లక్ష్మన్న, కరెంటు శ్రీనివాసులు,రాముడు,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా కొలువైన గణనాథులు

విశాలాంధ్ర-పత్తికొండ: వినాయక పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలలో వాడవాడలా గణనాథులు కొలువు తీరారు. కొలువుతీరిన గణనాథులకు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి భక్తాదులు తమ మొక్కుల ను తీర్చుకున్నారు. నిర్వాహకులు వినాయక మండపాల దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నష్టాల బాటలో మిరప రైతులు

కనీస మద్దతు ధర లేక లబోదిబోమంటున్న మిరప రైతులు

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలో మిరప రైతులు ఎల్ఎల్సీ దిగు కాలువ, బోరు బావులు కింద వివిధ రకాల మిరప పంటను వేశారు మిరప పంట దిగుబడి కోసం రైతులు పడరాన్ని పాట్లు పడి మిరప పంటను పండించిన కనీస మద్దతు ధర లేక లబోదిబోమంటున్నారు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి మిరప పండిస్తే మద్దతు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నామని మిరపరైతులు కోనేరు సాయిబేష్, కొరివిసాయిభేష్‌లు ఆరోపించారు. తెల్లమిరప అధిక దిగుబడి వచ్చినప్పటికీ మార్కెట్లో క్వింటాల్ రూ. 600 లు పలుకుతుందని దీంతో తమకు ఏమి గిట్టదని కనీసం తెల్ల మిరపకాయలు కోసిన కూలీలకు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోయారు. మండలంలో 9 వేల హెక్టార్లలో రైతులు మిరప సాగు చేశారు. మిరప కాయలను వ్యాపారస్తులు కొనుగోలు చేసి విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు అమ్ముతున్నారు. తెల్ల మిరపకు ధర లేక రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు. పెట్టిన పెట్టుబడి రాక రైతుల పంటలను తొలగిస్తున్నారు. మిరప రైతులను వెంటనే ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మిరపను తొలగించి సజ్జ, జొన్న ఇతర పంటలు వేసుకుంటామని రైతులు పేర్కొన్నారు. పత్తి వేయాలన్న సమయం గడిచిపోయిందని అందుకోసం అంతర్పంటలు వేసుకుంటామని తెల్లమిరప పంటను వేసుకుని అప్పులు పాలయ్యామని తమ గోడు ఎవరు వినేదేవరని తెల్ల మిరప రైతులు అధికారులను ప్రశ్నించారు.తీవ్రంగా నష్ట పోయిన తెల్ల మిరప రైతులను ఆదుకోవాలని రైతులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

వినాయక చవితి పూజల్లో పాల్గొన్న మంత్రి టి.జి భరత్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువు దీరిన వినాయక విగ్రహాలను పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ దర్శించుకున్నాను. ముందుగా రాంబొట్ల ఆలయం వద్ద కొలువు దీరిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాతబస్టాండులోని కురువ వీధిల్లోని వినాయక విగ్రహం వద్ద పూజలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ వరదల నుండి ప్రజలను రక్షించాలని వినాయకుడిని వేడుకున్నట్లు చెప్పారు. కుల,మత బేధాలు లేకుండా ప్రజలందరూ కలిసి వినాయక చవితి పండుగను జరుపుకోవడం కర్నూలు ప్రత్యేకత అన్నారు. హైదరాబాద్ తర్వాత కర్నూల్లోనే వినాయక ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని చెప్పారు.

పెద్దగోనెహాల్ గ్రామ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని పెద్దగోనెహాలు గ్రామ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు ఆదివారం డిమాండ్ చేశారు. గ్రామంలో సరైన సీసీ రోడ్లు, డ్రైనేజ్ సదుపాయం లేక వర్షం నీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయన్నారు. వర్షాకాలంలో వర్షం నీటిలోనే నడుస్తున్నామని వర్షం నీరు అధికంగా ప్రవహిస్తే ఇండ్లలో దూరుతున్నాయని ఆయన అన్నారు వర్షం నీటిలోనే రాత్రి వేళల్లో తిరుగుతున్నామని వర్షం నీటిలో పాములు.. తేళ్లు ఉంటే ఎలా అంటూ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీలను అధికారులు ఐదేళ్లుగా విస్మరించారనీ ఆరోపించారు. రోడ్లన్నీ వర్షానికి చిత్తడిగా మారాయని కాలుజారి కింద పడిపోతున్న పట్టించుకునే వారు లేకుండా పోయారని ప్రజలు వాపోయారు. వర్షం నీరు రోడ్డుపై నిలబడడం వల్లదుర్వాసన వస్తుందన్నారు.డెంగ్యూ, మలేరియా, రోగాల భారినపడే ప్రమాముందని ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తు న్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మానవతా దృక్పథంతో దాతలు ముందుకు రావాలి

విశాలాంధ్ర-తుగ్గలి: విజయవాడలో అధిక వర్షాలతో విజయవాడ నీటిమయం కావడంతో అందులో నివసించే ప్రజలు పూర్తిగా నష్టపోయిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే కే.యి.శ్యామ్ కుమార్, రాష్ట్రకార్య నిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్రలు దాతలు విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.పిలుపునందుకున్న మండల ప్రజలు విరాళాలు ఇవ్వడానికి ముందుకు వస్తుండడం పట్ల తుగ్గలి నాగేంద్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.అందులో భాగంగానే మండల పరిధిలోని ముక్కెళ్ల గ్రామ టీడీపీ నాయకులు రామచంద్ర, మునెప్ప, ప్రజలు తమ గ్రామం నుండి వరద బాధితులకోసం రూ.80 వేలు తుగ్గలి నాగేంద్రకు అందచేశారు.

క్రీడలతోనే మానసిక ఆరోగ్యం

విశాలాంధ్ర-పత్తికొండ: క్రీడలతోనే మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎస్సై వెంకటేశ్వర్లు, రిటైర్డ్ అధ్యాపకులు నాగేశ్వర రావు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రమోద్ కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం వాలీబాల్ ప్లే గ్రౌండ్ కార్యక్రమానికి హాజరై భూమి పూజ చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆరోగ్యానికి ఎంతో తోడ్పాటు నిస్తాయని, ప్రతిరోజు గంటపాటు తమకు వచ్చిన క్రీడలను ఆడాలన్నారు. కార్యక్రమంలో ఏపీ వాలీబాల్ రెఫరీ ఈ.రామాంజనేయులు, సీనియర్ క్రీడాకారుడు భీమ లింగప్ప,పీడీ. వేణుగోపాల్,కేవీకే స్టేడియం శిక్షకులు ధనుంజయ, క్రీడాకారులు మహమ్మద్, లక్ష్మన్న, మహేంద్ర, శీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మత్తులపై అధికారులు దృష్టి సారించాలి

విశాలాంధ్ర-తుగ్గలి: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లుచాలా అధ్వాన్నంగా తయారు అయ్యాయని, సమయానికి రవాణా జరగడం లేదని మండలంలోని ప్రజలతో పాటు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గుత్తి-పత్తికొండ,జొన్నగిరి-ప్యాపిలి, జొన్నగిరి-మద్దికెర,రహదారులు గుంతల మయమై చిన్నపాటి నీటి కుంటలను తలపిస్తున్నాయని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన రోడ్లు గుంటలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆర్‌డబ్ల్యుఎస్‌అధికారులు దృష్టి సారించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించడం పట్ల ప్రజలు వారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎద్రగుడి, జొన్నగిరి, తుగ్గలి, రాతన, పగిడిరాయి ప్రధానకూడలిలో రహదారులు గుంతలమయం అయిన సంగతి అధికారులకు, తెలిసిన సంగతే అయినా ఈ విషయమై పట్టించుకోక పోవడం ఏమిటని ప్రజలు విస్తు పోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కే.యి.శ్యామ్ కుమార్ చొరవ చూపి రోడ్ల మరమ్మత్తులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

టైర్ పగిలి కారు బోల్తా..ముగ్గురు మృతి

వారంతా సమీప బంధు వుల ఇంటిలో జరిగే శుభకార్యానికి హాజ రయ్యారు.శుభకార్యంలో చోటు చేసుకున్న మధుర జ్ఞాపకాలు నెమరేసుకుంటూ తిరిగి సాయంత్రం అదే కారులో తిరుగు ప్రయాణ మయ్యారు.అయితే మరికొద్ది నిమిషాల్లో వారంతా నివాసం చేరుకుం టురనుకున్న తరుణంలో విధివారిపై చిన్నచూపు కారణంగా టైరు పగిలి కారు బోల్తా పడిముగ్గురు మృతి చెందగా..మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డ ఘటన హాలేబీడు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.

విశాలాంధ్ర-ఆలూరు/ఆదోని : ఈ ప్రమాదంలో మహమ్మద్ గౌసు(35), నస్రీమ(30), సబిర(50) లు మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా ఆదోని ఫరీద్ సాహెబ్ మొహల్లాకు వాసులే.. దీంతో ఆదోనిలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారిలో జరిగే నామకరణ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా ఆలూరు-ఆదోని ప్రధాన రహదారిలోని ఒక్కసారిగా వారు ప్రయాణిస్తున్న కారు టైరు పేలడంతో బోల్తా పడినట్లు తెలిపారు. ఈప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.అందులోనూ ఇద్దరు చిన్నారులున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలి చేరుకొని గాయపడ్డ వారికి చికిత్స నిమిత్తం ఆదోని వైద్యశాలకు తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నందవరంలో తాగునీటి కుళాయిలా కనెక్షన్లు అస్తవ్యస్తం..!

- పంచాయతీ అనుమతి లేని 600పైగా కొత్త కనెక్షన్లు
- ప్రైవేట్ వ్యక్తులు ఒక్కో కనెక్షన్ కు రూ.1500 వరకు వసూళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చలానాదారులు
- అధికార పార్టీ నాయకులది తప్పంటూ చేతులెత్తిసిన సర్పంచ్
- ఇలా అయితే వేసవిలో నీటి సరఫరా బంద్..!

విశాలాంధ్ర-నందవరం : నందవరంలో అధికార పార్టీ నాయకులు ఆధిపత్యం కోసం చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలం కావడంతో మేజర్ గ్రామ పంచాయతీ నందవరంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారనుంది. పంచాయతీ అనుమతి లేని కలెక్షన్లతో చలాన్లు కట్టిన వ్యక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాగే కొనసాగితే వేసవిలో తాగునీటి సరఫరా ఏవిధంగా ఉంటుందో ఊహాకందని విషయంగా మారింది. మండల కేంద్రమైన నందవరంలో గత వారం రోజులుగా ఇష్టానుసారంగా గతంలోవేసిన పైప్‌లైన్లకు కొత్తగా కలెక్షన్లు తీసుకోవడంతో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలోని అధికార పార్టీకి చెందిన నాయకుడు తన అనుచారుడికి కొత్తగా పంచాయతీ అనుమతి లేకుండా కుళాయికనెక్షన్ ఇప్పించడంతో అదే పార్టీకి చెందిన మరి కొంతమంది నాయకులు తమ దగ్గరకు వచ్చిన అనుచరులు కుళాయి కలెక్షన్ కావాలని అడగడంతో మీరు వేసుకొండని ఆ నాయకులు కార్యకర్తలు చెప్పడంతో ఇష్టానుసారంగా ఒకేరోజు దాదాపు 600 పైగా కనెక్షన్ తీసుకున్నారు. అయితే మరో వారం రోజుల్లో కేంద్ర ప్రభుత్వం పథకం జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కనెక్షన్లను ఎమ్మెల్యే డా.బివి జయనాగేశ్వరరెడ్డి చేతులు మీదుగా ప్రారంభం కానుంది. కొత్తగా పైప్ లైన్ చేసి ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇస్తారని తెలియని ప్రజలు మాచాపురానికి చెందిన ఓవ్యక్తి, నందవరానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తులు ఇదే అదునుగా భావించి ఒక్కో కనెక్షన్‌కు వ్యక్తులను బట్టి రూ.600 నుండి 1500మధ్య డబ్బు లిచ్చి పాత పైప్‌లైన్‌కు కనెక్షన్ చేసుకుంటున్నారు. అయితే మూడు రోజుల్లోనే దాదాపు రూ.5 లక్షలకు ప్రైవేటు వ్యక్తులు సొమ్ము చేసుకున్నారని, దింతో చలాన్ల రూపంలో పంచాయతీ ఏకంగా రూ.25 లక్షల నష్టం వచ్చినట్లు అంచనా. గతంలో ఒక్కో కనెక్షన్‌కు రూ.4,600లు చలానా కట్టిన లబ్ధిదారులు తాగునీరు సరఫరా లేక గతవారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ఉండలనే ఉద్దేశంతో గత మూడేళ్లుగా ఎలాంటి కొత్త కలెక్షన్లు ఇవ్వలేదని, అధికార పార్టీ నాయకులు ప్రజలకు సరైన సమాచారం అందించక పోవడంతో ప్రజలు ఇష్టానుసారంగా చలాన్లు కట్టకుండా కుళాయిలు వేసుకున్నారని,వర్షాకాలం తాగు నీరు సరఫరా చేసిన, వేసవిలో తాగునీటిని అందించలేక పోతామని బహిరంగగానే అంటున్నారు. అధికార పార్టీ నాయకులు ఆధిపత్యం కోసం పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్తం చేశారు.

ఇప్పటికైనా కొత్తగా కలెక్షన్లు తొలగించి, కొత్తగా కొళాయి వేసిన, వేయించుకున్న వారిపై మండల, జిల్లా స్థాయి అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-తుగ్గలి: మండల పరిధిలోని శభాష్‌పురం గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు తలారి శ్రీనివాసులు తండ్రి తలారి రంగన్న గత 18 సం..గా పనిచేస్తూ ఈనెల 2న మరణించిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగస్తులు వారి అకాల మరణానికి చింతిస్తూ వారి కుటుంబానికి భరోసా కలిగిస్తూ మండలం లోని వీఆర్ఏలు,డోన్ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, తుగ్గలి ఆర్.ఐ సుధాకర్‌రెడ్డి, ఆస్పరి ఆర్.ఐ రంగస్వామి, సహకారంతో రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మృతుడు భార్య రామలక్ష్మికి అందచేశారు.కార్యక్రమంలో వీఆర్ఎలు శేఖర్, రమేష్, చౌడప్ప, రంగన్న పాల్గొన్నారు.

ఇనుప ట్రాఫిక్ డివైడర్లు అందజేత

విశాలాంధ్ర-ఆదోని: సోషల్ వర్కర్ నూర్ భాషా ఆదివారం డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషనుకు రెండు ఇనుప ట్రాఫిక్ డివైడర్లను అందజేశారు. దాత నూర్‌భాషను డీఎస్పీ సోమన్న సన్మానించారు.ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఆదోని పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధి కంగా ఉన్న నేపథ్యంలో తనవంతు సహాయ సహకారం కింద సోషల్ వర్కర్ నూర్‌భాష ఈ ఐరన్ ట్రాఫిక్ డివైడర్లను అందించడంతో అభినందించారు. పట్టణ ప్రజలు, వాహనదారులు, ఆటోవాలాలు, వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని డీఎస్పీ కోరారు.

సిటీ కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా జిలానిభాష

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు: కర్నూలు నగర (సిటీ)కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా షేక్ జిలాని భాష నియమితులయ్యారు. కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ జిలాని భాషని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియమించారు. జిలాని భాష మాట్లాడుతూ తనపై మీద నమ్మకంతో అధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ కాంగ్రెస్ నాయకు రాలు సోనియాగాంధీ, యువ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, అఖిలభారత కాంగ్రెస్ కమి టీ అధ్య క్షులు మల్లికార్జున ఖర్గే,ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, జాతీయ, నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియచేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

విశాలాంధ్ర-ఆదోని : విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం ఆదోనిలో చోటు చేసుకుంది. స్థానిక కౌదల్‌పేటకు చెందిన మహబూబ్ బాషా అనే యువకుడు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని భీమా సర్కిల్ ఎదురుగా ఉన్న ఓ మెడికల్ షాపులోని విద్యుత్ మోటార్ రిపేర్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదా ఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అన్నదమ్ములు, సోదరి ఉన్నారు. ఇంట్లో యువకుడు మహబూబాబ్ బాష కుటుంబ పోషణను సాగించేవాడని తల్లిదండ్రులు బంధువులు రోధిస్తున్న తీరు పలువురుని కంటతడి తెప్పించింది.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 09, సెప్టెంబర్ 2024

నాయుడన్నతోనే ఆదోనిలో ఐక్యత, అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-ఆదోని : సుదీర్ఘ రాజకీయ జీవితంలో మాజీ ఎమ్మెల్యే , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడుతోనే ఆదోనిలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తామని ప్రత్యేకంగా ఆదోనిలో శాంతియుత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేస్తున్నామని టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అఫ్సర్ బాషా స్పష్టం చేశారు. వినాయక చవితి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ను కలిసి ప్రత్యేకంగా వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో జిల్లా వ్యాప్తంగా ను వినాయక చవితి పండుగను కుల మతాలకతీతంగా అన్ని వర్గాల వారు కలిసిమెలిసి జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆదోనిలో ఎలాంటి సమస్య వచ్చినా సమయస్ఫూర్తితో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా పరిష్కరిస్తూ ఆదోని అభివృద్ధికి కృషి చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, ఐక్యత , అభివృద్ధి కోసం కృషి చేయడంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుకు ఎవరు సాటి రారని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు జీవితాంతం ఆదోని అభివృద్ధికి ప్రజల ఐక్యతకు సంక్షేమానికి కృషి చేస్తారని తాను దైవ సన్నిధిలో ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా..!-అధ్వాన్నంగా ఉన్న వాల్మీకి సర్కిల్ రోడ్డు

విశాలాంధ్ర-హొళగుంద: స్థానిక బస్టాండ్ నుండి వాల్మీకి సర్కార్ వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో ఈ రోడ్డుపై ఎలా నడవాలో బాబోయ్ ఆ దేవుడికి తెలుసు అంటూ ప్రజలు వాపోతున్నారు రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీళ్లు నిలబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆరోపించారు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా, బురదకుంటగా మారడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, సిద్దేశ్వర స్వామి, సాయిబాబా, మారమ్మ, చినిగి సాబ్, సాయిబు అన్న దర్గాలకు దర్శనం కోసం వెళ్లే మహిళా భక్తులు భక్తులు నానఅవస్థలు పడి రోడ్డుపై తిరుగుతున్నారు రోడ్డు వేయాలంటూ ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు తెలిపిన ఇంతవరకు పట్టించుకునే నాథుడు కరువయ్యారని ప్రజలు అధికారులపై ఆగ్రహించారు రోడ్డు అద్వానంగా మారడంతో గుంతలు వాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాయని వాహనాల యజమానులు తెలిపారు ఇరు రాష్ట్రాలకు అనుసంధానం చేసే రోడ్డు కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో తిరుగుతున్నారు నిత్యం కర్నూల్, ఆదోని, ఎమ్మిగనూరు వెళ్లారంటే ఈ రోడ్డు దాటి వెళ్లాల్సి ఉంటుందని అతి కష్టం మీద రోడ్డుపై ప్రయాణించి పట్టణ ప్రాంతాలకు తిరుగుతున్నామని ప్రజలు పేర్కొన్నారు ఆదోని వ్యవసాయ మార్కెట్ కు పంటలను తరలించాలంటే గగనంగా మారిందని రైతులు అన్నారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పనులు అప్పుడు ఇప్పుడు జరుగుతుందంటూ కాకమ్మ కబుర్లు చెబుతున్నారు తప్ప శాశ్వత రోడ్డు వేయటం లేదని అధికారులపై ప్రజలు ధ్వజమెత్తారు సంబంధిత జిల్లా ఉన్నతాధికారు లు చర్యలు తీసుకొని వెంటనే వాల్మీకి సర్కిల్ రోడ్డు వేయాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు ఆర్ అండ్ బి ఏ ఈ అనీఫ్ వలి నీ వివరణ కోరగా కొత్త రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల 95 లక్షల రూపాయలకు ప్రతిపాదించామని నిధులు వచ్చిన వెంటనే కాంట్రాక్టర్ ద్వారా రోడ్డు నిర్మాణం చేపడతామని అన్నారు రోడ్డు నిర్మాణానికి జనవరి నెలలోనే ప్రభుత్వం మంజూరు చేసిందని నిధుల సమస్య వల్ల రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేకపోయామని అన్నారు బడ్జెట్ రిలీజ్ అయితే రోడ్డు పనులు ప్రారంభిస్తామని అన్నారు

వాడ వాడలా కొలువుదీరిన గణనాథులు

విశాలాంధ్ర-హొళగుంద : మండల కేంద్రమైన హొళగుందలో శనివారం 24 చోట్ల గణేష్ మిత్రమండలి వారు గణేష్ విగ్రహాలను కూర్చోబెట్టారు. గణేష్ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో ప్రజలు పూజలు చేశారు. గణేష్ మిత్ర మండలి వారు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి వేళలో భక్తి గేయాలు, పలు సాంస్కృతి కార్యక్రమాలు, భజనలు కీర్తనలు జరిగాయి. గణేష్ మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మండలంలో 113 చోట్ల గణేష్ విగ్రహాలను గణేష్ మిత్రమండలి వారు కూర్చోబెట్టారని ఎస్సై బాలనరసింహులు తెలిపారు. గణేష్ పండుగ సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గణేష్ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో గణేష్ మిత్ర మండలి వారు భారీ విగ్రహాలను కూర్చోబెట్టారు. దేవమ్మ ఆలయం, శ్రీరామ ఆలయం, దక్షిణామూర్తి ఆలయంతో పాటు తదితర కాలనీలో గణేష్ విగ్రహాలు కూర్చోబెట్టారు.దేవమ్మ ఆలయంలో ఆదివారం శ్రీ దేవమ్మ వినాయక సేవా సంస్థలు భక్తులకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాడ వాడల బొజ్జ గణపయ్యలకు భక్తులు పూజలు నిర్వహించారు.

విశాలాంధ్ర-కోడుమూరు :మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి

పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని వీధులలో గణనాథులు కొలువుదీరి భక్తులచే విశేష పూజలు అందుకుంటున్నాడు. ముఖ్యంగా కోడుమూరు పట్టణంలో వాడ వాడలా అందంగా ముస్తాబు చేసిన మంటపాలలో..వివిధ రూపాలలో గణనాథుడు కొలువుదీరి భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించే వినాయక చవితి ఉత్సవ సంబరాలను ఆస్వాదిస్తున్నాడు. శనివారం ఉదయం నుంచి పట్టణంలోని ఆయా వీధుల్లో వివిధ రకాల పూలాలంకరణ, విద్యుత్ దీపాలతో అలంకరించిన మంటపాల్లో ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు,భక్తులు వినాయకుడి విగ్రహాలను ప్రతిష్టించి,భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరిన గణనాథులను చిన్నారులు,మహిళలు సందర్శించి,పూజలు నిర్వహించి తమ జీవితాల్లో విఘ్నాలు తొలగించాలని విఘ్నేశ్వరుడిని వేడుకుంటున్నారు. ముఖ్యంగా శనివారం ఉదయం పట్టణంలోని స్థానిక మెయిన్ బజార్లో వెలసిన శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో వీర శైవ లింగాయితీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులచే ప్రతిష్ఠించిన గణనాథుడికి కోడుమూరు ఎస్సై ఏపీ శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అతి పెద్దవినాయక విగ్రహం పట్టణంలోని భక్తులు,ప్రజలందరినీ ఆకర్షించడంతో చౌడేశ్వరివీధి ప్రాంతమంతా ఆదివారం సాయంత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆయా వినాయక మంటపాల వద్ద నిర్వాహకులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. కాగా వినాయక చవితి పండుగ ఉత్సవాల సందర్భంగా కోడుమూరు పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో ఆధ్యాత్మికంగా భక్తుల సంబరాలతో కొత్తశోభ సంతరించుకుంది. ఇదిలా ఉండగా శనివారం ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సోమవారం నిమజ్జనోత్సవం నిర్వహించేందుకు గణేష్ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణ శివారులోని వెంకటగిరి రోడ్డులో వినాయక ఘాట్ ఏర్పాటు చేసి భక్తులు వీక్షించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తుంది.

విశాలాంధ్ర-సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్ తో పాటు మండల

పరిధిలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మొత్తం 96 మంది గణనాథులు మండపాలలో శనివారం కొలువుతీరారు. శనివారం ఉదయమే మండపాల్లో కొలువుతీరిన గణనాథులకు వివిధ రకాల పూలాలంకరణతో పాటు మండపాలను రంగురంగులవిద్యుత్ దీపాలతో ముస్తాబ్ చేసి మహిళలు మరియు చిన్నారులు పూజలు నిర్వహించి తమ జీవితాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని విఘ్నేశ్వరుని వేడుకున్నారు. శనివారం కొలువుతీరిన గణనాథులను సోమవారం తుంగభద్ర నదిలో నిమజ్జనోత్సవం నిర్వహించేందుకు ఉత్సవకమిటీ సభ్యులు ఏర్పాటు చేసుకున్నారు. వినాయకచవితి సందర్భంగా కొలువుదీరిన గణనాథుల మండపాలను శనివారం కోడుమూరు సిఐ తబ్రేజ్ సి.బెళగల్ తిమ్మారెడ్డి మరి సిబ్బందితో కలిసి గణేష్ మండపాలను పరిశీలించి సీఐ నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జరుపుకోవాలని ఆయన వారికి సూచించారు.

విశాలాంధ్ర-ఆలూరు :మండలం కేంద్రంలో కోయనగర్ కాలనీ కొలువుదిరిన

గణనాధుడు వినాయక చవితి పండుగ పురస్కరించుకొని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కాలనీ భక్తులు శనివారం,ఆదివారం రెండు రోజులు గణనాధుడుకి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నైవేద్యం సమర్పించి పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. వినాయక మండపాల దగ్గర విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి, అన్నదాన కార్యక్రమాలు. చేపట్టారు. ఈ కార్యక్రమంలో వినాయక భక్తి కమిటీ సభ్యులు నాగరాజ్, శివ, బాలు, మహేష్, చిన్న, మల్లయ్య, భక్తులు కాలనీవాసులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పత్తికొండ: వినాయక పర్వదినాన్ని పురస్కరించుకొని

నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలలో వాడవాడలా గణనాథులు కొలువు తీరారు. కొలువుతీరిన గణనాథులకు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి భక్తాదులు తమ మొక్కుల ను తీర్చుకున్నారు. నిర్వాహకులు వినాయక మండపాల దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విశాలాంధ్ర-కల్లూరు: కల్లూరు అర్బన్ ,రూరల్ ప్రాంతాలలోని వీధులలో

భక్తులు గణపతి విగ్రహాలను వాడవాడలో ఏర్పాటు చేసిన మండపాలలో ప్రతిష్టించి గణనాథులకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. డబ్ల్యూ ఎస్ కాలనీ, పెద్దపాడు,బి.క్యాంప్,చౌరస్తా,శరీన్ నగర్, కృష్ణానగర్,హౌసింగ్ బోర్డ్కాలనీ, లక్ష్మీపురం, చిన్నటేకూరు, బస్తిపాడు, ఉలిందకొండ ,పర్ల తదితర ప్రాంతాల్లో భక్తులు గణనాథులను కొనుగోలు చేసుకుని తీసుకొచ్చి స్వామి వారికి ముస్తాబు చేసిన స్టేజీలలో నెలకొల్పి అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారికి ఇష్టమైన తీర్థప్రసాదాలతో పూజలు చేశారు. విగ్రహ మండపాల దగ్గర డీజే లు, స్వామి వారి కీర్తనలు నిత్యం ఆలపిస్తూ భక్తులు సందడి సందడిగా వినాయక విగ్రహాల ముందు గుంపులు తీరుతూ కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, అధికారులు, వ్యాపారవేత్తలు, భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున స్వామివారి పూజలో పాల్గొంటున్నారు.

విశాలాంధ్ర-తుగ్గలి: మండలంలోని ఆయా గ్రామాల్లో బొజ్జ గణపయ్యలు

వాడవాడలా వెలిశారు.గ్రామాలలో వినాయకుని సంబరాలు అంబరాన్నంటాయి. తుగ్గలిలో నాగేంద్ర,శబాషపురం లో మోహన్,రోళ్లపాడు తాండాలో తులసీ నాయక్ లు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమవారం నిమజ్జనం రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

విశాలాంధ్ర-వెలుగోడు: వెలుగోడు మండలం లో వినాయక చవితి పండుగ

నాడు ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేయడానికి పోలీస్ శాఖ, గ్రామపంచాయతీ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండలం లో 76 విగ్రహాలను మండపాలలో ప్రతిష్టించారు. వెలుగోడు పట్టణం లో ఈ సారి అత్యధికంగా 39 విగ్రహాలను కూడళ్ళలో, దేవాలయాల వద్ద ఏర్పాటు చేసి, రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో , సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేసారు. నిమజ్జనానికి గాలేరు వాగు వద్ద బారికేడ్లు , లైటింగ్ ఏర్పాట్లు చేసారు. పోలీసులు ఎలాంటి అవాంఛనియ సంఘటన లు జరగకుండా అందరికి మార్గదర్శకాలు ఏర్పాటు చేసి, గట్టి బందోబస్తూ ఏర్పాట్లుచేసినట్లు ఎస్. ఐ విష్ణు నారాయణ తెలిపారు.

విశాలాంధ్ర-జూపాడుబంగ్లా: మండలంలోని ఆయా గ్రామాలలో

కొలువుదిరిన గణనాధులకు వినాయక చవితి పండుగ పురస్కరించుకొని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆయా గ్రామాలలోని భక్తులు శనివారం,ఆదివారం రెండు రోజులు గణనాధులకి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి ఇష్టమైనచెరుకు గడలు,గరిక,ఉంద్రాళ్ళు, ఆపిల్,జీని వంటి తదితర వాటిని నైవేద్యంగాసమర్పించి పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.వినాయక మండపాల దగ్గర విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి,అన్నదాన కార్యక్రమాలు. చేపట్టారు.

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కోవెల కుంట్లపట్టణంలో పాటు మండలంలోని గ్రామాల్లో వాడ వాడలాగణనాథులు కొలువు తీరారు. కొలువుతీరిన గణ నాథులకు ఎంతో భక్తిశ్రద్ధల తో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రెండో రోజు ఆదివారం నిర్వాహకులు మండపాల దగ్గర అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ వారు తెలిపిన వివరాల మేరకు పట్టణంలో 30 గణనాథులు గ్రామాలలో 20 గణనాథులు కొలువు తీరానని కమిటీ నాయకుడు గడ్డం అమర్నాథరెడ్డి తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: విశ్వ విద్యాలయ అనుబంధ హాస్టల్లో వసతి పొందుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ఛాన్సలర్ ఎన్. టి.కె.నాయక్ తెలిపారు.వినాయక చవితి పర్వదినం విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. హాస్టల్ పరిసరాలతో పాటు వంటగదిలో వంటపాత్రలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కూరగాయలు బియ్యం మొదలైనటువాటిని సరిగా శుభ్రం చేసిన తర్వాతనే వినియోగించాలని ఆదేశించారు. వంట చేసే సమయంలో బోరు నీటితోవస్తున్న సమస్యలకు పరిష్కారంగా వంటలకు శుద్ధ జలాలను నియమించే విషయాన్ని పరిశీలించవలసిందిగా హాస్టల్ అధికారులకు సూచించారు. హాస్టల్ ఉద్యోగులంతా సమయం పాలన పాటిస్తూ ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహించాల న్నారు. వర్సిటీలో చేరిన ఇంజనీరింగ్ విద్యా ర్థులకు ప్రస్తుతం కౌన్సిలింగ్ కొనసాగుతున్న పీజీ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పనలో భాగంగా పెండింగ్లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయవలసిందిగా సంబందించిన అధికారులకు సూచించారు.

విగ్రహ మండపాల దగ్గర జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర -కల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో వాడ వాడలా వినాయక విగ్రహాలు భక్తులు అనుమతుల మేరకు ప్రతిష్టించుకోవడం జరిగిందని, వాహనాలు వెళ్లేటప్పుడు నెమ్మదిగా వెళ్లాలని భక్తులు పిల్లలు మండపాల దగ్గర రద్దీగా ఉండడం జరుగుతుందని ఈ విషయాన్ని వాహనదారులు తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకొని తమ ప్రయాణాలు సజావుగా కొన సాగించుకోవాలని,మరో మార్గం గుండా వెళ్లాలని వాహన దారులకు ఎస్సై ధనుంజయ తెలిపారు.

ఈ మేరకు మండల పరిధిలోని ఉలిందకొండ, చిన్నటేకూరు, బస్తిపాడు, రేమడూరు, యాపర్లపాడు, పెద్దటేకూరు, లక్ష్మీపురం ,తడకనపల్లి తదితర గ్రామాల్లో సంచరించి వినాయక మండపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధులలో విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందని వాహనదారులు ఈ విషయాన్ని పరిశీలించి నెమ్మదిగా ప్రాంతాల్లో వెళ్తున్నప్పుడు తగు జాగ్రత్తగా వాహనాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పంపయస్వామి మహే స్వామి లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు దూర ప్రాంతాల నుండి తరలివచ్చి భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. మహిళా భక్తులు ప్రతిమెట్టుకు పసుపు బండారాన్ని అంటించి గిరి పైకి వెళ్లి పూజలు చేసి తమ మొక్కుబడి తీర్చుకున్నారు.ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి.

రహదారి గుంతలమయం..ఇబ్బంది పడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి -తిమ్మనాయునిపేట గ్రామాల మార్గమధ్యలో రహదారి గుంతల మయంగా మారింది. మార్గ మధ్యలో ఎస్. చెన్నంపల్లి నుండి తిమ్మ నాయునిపేట గ్రామం వరకు 5 కిలోమీటర్ల మేర రహదారి పూర్తి గుంతలమయం కావడంతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.కొన్నిచోట్ల తారురోడ్డు పోయి గ్రావెల్ రోడ్డును తలపిస్తుండడంతోపాటు మోకాళ్లోతు గుంతలు కూడా పడ్డాయి. రెండు సంవత్సరాల నుండికనీసం రోడ్డు మరమ్మతులు కూడా అధికారులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.తిమ్మనాయుని పేట సమీపంలో పవర్ గ్రీడ్ పనులు జరుగుతుండడంతో భారీ వాహనాలు రహదారిపై రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి నుండి కోవెలకుంట్ల,జమ్మలమడుగు, ఆళ్లగడ్డ తదితర పట్టణాలకు ఈ రహదారి మీదుగా వెళితే దూరం తగ్గుతుండడంతో ప్రైవేట్ వాహనదారులు ఇటువైపే మల్లుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రహదారి మరమ్మతుపనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అఖిల భారత గిరిజన రాష్ట్ర ఉద్యోగుల సంఘం ..

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : అఖిల భారత గిరిజన రాష్ట్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ సి. గంగన్న, ప్రధాన కార్యదర్శిగా వెంకట రాముల నాయక్ ను ఎన్నుకున్నారు.. ఆదివారం నంద్యాలలోని ఎన్జీవోస్ కాలనీలో ఎస్టీ కమ్యూనిటీ హాల్ నందు అఖిల భారత గిరిజన రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. అలాగే జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా వెంకటరమణ బాయి, కోశాధికారిగా కంపా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఫకీరయ్య, శ్రీనివాసరావు, డాక్టర్ కాంతారావు నాయక్, సీతమ్మ, జాయింట్ కార్యదర్శులుగా వెంకటరాములు నాయక్, బద్దు నాయక్, లక్ష్మీ నాయక్, వీరన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వెంకయ్య, వనజ , రాము గోపాల్ చైర్మన్గా మరియదాసును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు.